సాక్షి
రంగారెడ్డి
గురువారం । 10 । ఆగస్టు । 2023



మూలన చేర్చారు..!

పురపాలక సంఘం కొనుగోలు చేసిన జేసీబీ, కారు, మినీ డోజర్లు, టాటా ఏస్ వాహనాలు నిరుపయోగంగా మారాయి. 8లో▸



జలపాతం.. జాగ్రత్త గురూ..

మంచాల మండలం చెన్నారెడ్డి గూడ – బోడకొండ గుట్టల జలపాతానికి పర్యటకుల తాకిడి పెరిగింది. 8లో▸



జీవోను రద్దు చేయాలి

ఖానాపూర్‌లో ఖబరస్థాన్ నిర్మాణానికి జారీ చేసిన జీవోను రద్దు చేయాలని జెడ్పీటీసీ వెంకటేశ్ డిమాండ్ చేశారు. 8లో▸

న్యూస్‌రీల్

బీజేపీదే అధికారం

పార్టీ ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్



మాట్లాడుతున్న తరుణ్‌చుగ్

తుక్కుగూడ: తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జ్ తరుణ్‌చుగ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం తుక్కుగూడలో జిల్లా పదాధికారుల సమావేశం నిర్వహించి, దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, మాజీ ఎంపీ నర్సయ్యగౌడ్, రాష్ట్ర నాయకులు సుధాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

తలకొండపల్లిని అగ్రగామిగా నిలుపుతా

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



బ్రిడ్జి నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తలకొండపల్లి: ఈ ప్రాంతమంటే ఎనలేని అభిమానమని, తలకొండపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి జిల్లాలోనే అగ్రగామిగా నిలుపుతానని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో పర్యటించారు. ఇటీవల జూనియర్ కళాశాల మంజూరు కావడంతో భవనాన్ని పరిశీలించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలోనే తరగతులను ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. సీఎం కేసీఆర్ వల్ల ఈ ప్రాంత ప్రజల కళ సాధ్యమైందని పేర్కొన్నారు. కళాశాల మంజూరుతో 600మంది విద్యార్థులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం తలకొండపల్లి – మిడ్జిల్ రోడ్డులో బ్రిడ్జి నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాసు యాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నర్సింహ, సీనియర్ నాయకుడు దశరథ్ నాయక్, కళాశాల ప్రిన్సిపాల్ అనసూయ, సర్పంచ్ లలిత, ఉప సర్పంచ్ అనిల్, ఎంపీడీఓ శ్రీకాంత్, సూపరింటెండెంట్ శ్యామ్‌సుందర్, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సీఎం కేసీఆర్ మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి మంజూరైన 108 అంబులెన్సులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గానికి 5 అంబులెన్సులు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, ఎంపీపీ కృపేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజస్థాన్‌లో సాగు.. హైదరాబాద్‌లో విక్రయం

గంజాయి అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

ఇబ్రహీంపట్నం రూరల్: రాజస్థాన్‌లో తన ఇంటి వద్ద సాగు చేసిన గంజాయిని కారంపొడి డబ్బాల్లో తరలించి హైదరాబాద్‌లో విక్రయిస్తున్న వ్యక్తిని మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, ఆదిబట్ల పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం ఎస్‌ఓటీ సీఐ రవి కుమార్, ఆదిబట్ల సీఐ రఘువీర్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. రాజస్థాన్ రాష్ట్రం, బిల్వాడ జిల్లా, బాక్లి గ్రామానికి చెందిన మహేందర్ సింగ్ పది సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చాడు. ప్రస్తు తం తుర్కయంజాల్ రాంనగర్ కాలనీలో కిరా ణా దుకాణం నిర్వహిస్తున్నాడు. కరోనా సమ యంలో వ్యాపారంలో నష్టాలు రావడంతో మాదకద్రవ్యాల విక్రయం మొదలు పెట్టాడు. రాజస్థాన్‌లోని తన ఇంటి ముందు గంజాయి సాగు చేశాడు. అక్కడి నుంచి ప్రైవేటు ట్రావెల్స్‌లో కారం పొడి, మినుముల డబ్బాల్లో నింపి హైదరాబాద్‌కు తరలించేవాడు. నగరంలో 10 గ్రాముల గంజాయిని రూ.5 వేల నుంచి రూ. 6వేల వరకు విక్రయించేవాడు. ఈ విష యం తెలియడంతో మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ సీఐ రవికుమార్ నేతృత్వంలో దాడులు చేశా రు. రూ.10 లక్షల విలువ చేసే గంజాయి, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.



ఇబ్రహీంపట్నం: లక్ష్మీనగర్ కాలనీని ముంచేసి ఇళ్లలోకి చేరిన ఇబ్రహీంపట్నం చిన్నచెరువు నీరు

జలాశయాలు విలవిల!

జిల్లాలోని పలు జలాశయాలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. శిఖం భూములను ఆక్రమించి ఇష్టారాజ్యంగా నిర్మాణాలు వెలిశాయి. ఇటీవల కురిసిన ఏకధాటి వర్షాలతో చెరువులు, కుంటలు నిండి.. ఆక్రమణలు కళ్లకు కడుతున్నాయి. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ వ్యవహారాన్ని అధికార యంత్రాంగం కళ్లప్పగించి చూస్తోందనే ఆరోపణలున్నాయి.

అన్యాక్రాంతమవుతున్న చెరువులు, కుంటలు

- శిఖం, ఎఫ్‌టీఎల్ పరిధిలో జోరుగా ఆక్రమణలు
- ఏటి కాల్వలను ఆక్రమించి వెలిసిన నిర్మాణాలు
- పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ శాఖలు

ఇబ్రహీంపట్నం, ఇబ్రహీంపట్నం రూరల్: హైదరాబాద్‌కు 30 కిలోమీటర్ల దూరంలోని ఇబ్రహీంపట్నం పెద్ద చెరువు కబ్జాకు గురైంది. సుమారు 1,400 ఎకరాల్లో 50 ఫీట్ల లోతులో 0.8 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో విస్తరించి ఉన్న ఈ చెరువుకు 1,700 ఎకరాల ఆయకట్టు ఉంది. ఇందులోకి వరద వచ్చే ఫిరంగి కాల్వ కబ్జాకు గురికావడం, అడ్డంగా కట్టడాలు వెలియడంతో వర్షపు నీటి పారుదలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. దీంతో ఎప్పుడూ ఎండని చెరువు 1992లో చుక్క నీరు లేకుండా వట్టిపోయింది. ఆతర్వాత 2008లో కురిసిన భారీ వర్షాలతో మళ్లీ జల కళను సంతరించుకుంది. నగరానికి చేరువగా ఉండటం, రియల్ ఎస్టేట్ వ్యాపారం పెరగడంతో.. ఇక్కడి చెరువులు, కాల్వలు, కుంటలకు చెందిన వందలాది ఎకరాల భూములు అన్యాక్రాంతమయ్యాయి. ఆదిబట్ల, కొంగరకలాన్, మంగళ్‌పల్లి, ఉప్పరిగూడ నుంచి 16 కిలోమీటర్ల మేర ఉన్న ఫిరంగి కాల్వ కబ్జాకు గురైంది. సహజ వనరులను కాపాడాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలున్నాయి. హెచ్ఎండీఏ అధికారులు సైతం కాల్వపై దృష్టిసారించం లేదు. దీంతో అక్రమార్కులు మట్టి, రాళ్లు నింపేస్తూ కాల్వ విస్తీరణాన్ని తగ్గిస్తున్నారు. బఫర్ జోన్ సైతం వదలడం లేదు. కాల్వ స్థలంలో ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. ఎంపీపటేల్‌గూడ రెవెన్యూ పరిధిలోని ఔటర్ రింగ్‌రోడ్డు సమీపంలో నిర్మించిన అపార్ట్‌మెంట్లలోకి వర్షపు నీరు చేరింది. ఆక్రమణలను నివారించాల్సిన అధికారులు తాయిళాలకు అలవాటుపడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు.

వెంచర్లు, ఇళ్లలోకి వరద

పెద్ద, చిన్న చెరువులు నిండటంతో శిఖం భూముల్లో వెలిసిన ఇళ్లు, ఫంక్షన్ హాల్‌తో పాటు పలు కట్టడాల్లోకి సైతం నీరు చేరింది. దీంతో ఆయా ప్రాంతాల్లోని ప్రజలు ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారు. ఈసారి సైతం కురిసిన ఏకధాటి వర్షాలతో ప్రస్తుతం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. పెద్ద చెరువు బ్యాక్ వాటర్ లక్ష్మీనగర్ కాలనీలోని రెండు వరుసల ఇళ్లను ముంచేసింది.

కద్తాల్‌లో..

కద్తాల్: కద్తాల్ రెవెన్యూ పరిధిలో సుమారు 15 చెరువులు, 190 కుంటలు ఉన్నాయి. వీటి శిఖం భూములను కొంతమంది ఆక్రమించారు. భూముల ధరలు భారీగా ఉండటంతో దేవరచెరువు, నాగిరెడ్డికుంట, గుర్లకుంట, ఉప్పరాసికుంట, చౌడమ్మచెరువు, పెద్దకుంట, కుమ్మరికుంట ఆక్రమణకు గురయ్యాయి. పగలు, రాత్రి తేడా లేకుండా చెరువులు, కుంటల్లోని మట్టిని అక్రమంగా తరలిస్తులిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికైనా సర్వే చేయించి శిఖం భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

'చిన్న'బోతున్న చెరువులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని చెరువులు కుంచించుకుపోగా.. వెంచర్లు, కబ్జాలతో కుంటలను మాయం చేశారు. శిఖం భూముల్లో నిర్మించిన ఇళ్లు నీట మునగడంతో బాధితులు కన్నీటి పర్యంతమవుతున్నారు. అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు, పోచమ్మకుంట చెరువులు కొంతమేర కబ్జా కోరల్లో చిక్కుకోగా.. సుందరీకరణ పేరుతో చెరువుల విస్తీర్ణం మరింత తగ్గిపోయింది. బాలాపూర్ పెద్దచెరువు, వెంకటాపూర్ బురాన్‌ఖాన్ చెరువులు సైతం అన్యాక్రాంతానికి గురయ్యాయి.

రెండు దశాబ్దాల క్రితమే..



మీర్‌పేట: జిల్లెలగూడ చందన చెరువు

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని పెద్ద చెరువు పూర్తి విస్తీర్ణం 70 ఎకరాలు ఉండగా 10 ఎకరాల వరకు ఆక్రమణకు గురైంది. మంత్రాల చెరువు 67.08 ఎకరాలుండగా దాదాపు 8 ఎకరాలు, చందన చెరువు పూర్తి విస్తీర్ణం 34.01 ఎకరాలు కాగా 5 ఎకరాల వరకు కబ్జాకు గురైందని, ఈ ఆక్రమణలన్నీ 20 ఏళ్ల క్రితమే జరిగినట్లు స్థానికులు తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే గతంలో మీర్‌పేట, జిల్లెలగూడలోని లోతట్టు ప్రాంతాలు పూర్తిగా ముంపునకు గురయ్యేవి. కొన్ని కాలనీలు దాదాపు నెల రోజుల పాటు ముంపులోనే ఉండాల్సిన పరిస్థితి. ముంపు సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ. 23 కోట్లతో ట్రంక్ లైన్‌ను నిర్మించడంతో సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

శిఖం భూమిలో వెంచర్లు

తుక్కుగూడ: జిల్లాలోనే అతి పెద్ద ఒకటి రావిర్యాల పెద్ద చెరువు. 1561లో గోల్కొండ రాజు ఇబ్రహీంకులీ ఈ ప్రాంతంలో తాగు, సాగు నీరు అందించేందుకు దీన్ని తవ్వించారు. 800 ఎకరాల 20 గుంటల విస్తీర్ణం కలిగిన ఈ చెరువు కొన్నేళ్లుగా ఎండిపోయింది. దీంతో శిఖం భూములకు ఎల్ఓసీలు సృష్టించి వెంచర్లు చేసి, ప్లాట్లను విక్రయించారు. చెరువు శిఖం భూములు ఇప్పటికే ఇతరుల పేరున మారాయి.

చెరువులో వెంచర్

రావిర్యాల చెరువు శిఖం భూమిలో దాదాపుగా 100 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వెంచర్లు వెలిశాయి. పదేళ్ల కాలంలో రాజకీయ నాయకులు తమ పలుకుబడిని ఉపయోగించి నకిలీ ఓఆర్సీలు సృష్టించి వెంచర్లు చేశారు. ఇందులోని ప్లాట్లను సైతం ఎప్పుడో అమ్మేశారు. రావిర్యాల చెరువు శిఖం భూమికి భౌగోళిక హద్దులు ఏర్పాటు చేయాలని సర్దార్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి హైకోర్టులో పిల్ దాఖలు చేశాడు. ఇందుకు అనుగుణంగా తీర్పు వచ్చినప్పటికీ ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి.



తుక్కుగూడ: రావిర్యాల పెద్ద చెరువులో మునిగిన ఇటుక బట్టీ

చర్యలు తీసుకుంటాం



ఇబ్రహీంపట్నంలో కాల్వలు, కుంటలు ఎక్కడ కబ్జాకు గురైనా చర్యలు తీసుకుంటున్నాం. రాచకాలువపై కొన్ని చోట్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చాం. కాల్వలు, బఫర్ జోన్లు కబ్జా చేస్తే సహించేది లేదు. ఇరిగేషన్, రెవెన్యు శాఖ అధికారుల సహకారంతో ఆక్రమణలను గుర్తించి చర్యలు తీసుకుంటాం.

– రాజ్యలక్ష్మి, ఏఈ ఇబ్రహీంపట్నం, ఇరిగేషన్ శాఖ



ఇబ్రహీంపట్నం రూరల్: కొంగరకలాన్-మంగళ్‌పల్లి మధ్య కబ్జాకు గురైన ఫిరంగి నాలా



కద్తాల్: కుదించుకుపోయిన ఉప్పరాశికుంట



ఆక్రమణల కారణంగా కుచించుకుపోయిన అల్మాస్‌గూడ పోచమ్మకుంట

'గృహలక్ష్మి' గందరగోళం

- ఇళ్ల దరఖాస్తులకు జనం పరుగులు
- సర్టిఫికెట్ల కోసం మీ-సేవ కేంద్రం వద్ద నిరీక్షణ
- దరఖాస్తులు ఎవ్వరికి ఇవ్వాలో తెలియక ఆందోళన
- మార్గదర్శకాలు రాలేదంటున్న అధికారులు
- మరిన్ని కథనాలు లోపల పేజీల్లో..



సర్టిఫికెట్ల కోసం రెడ్డిపల్లి మీ-సేవ కేంద్రానికి వచ్చిన జనం

మొయినాబాద్: గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే లబ్ధిదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ నెల 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం గడువు ఇవ్వడంతో సమయం లేక మీ-సేవ కేంద్రం, తహసీల్దార్ కార్యాలయానికి పరుగులు పెడుతున్నారు. అన్ని సిద్ధం చేసుకుని మండల కార్యాలయానికి వస్తే దరఖాస్తును ఎవ్వరికి ఇవ్వాలో తెలియక ఆందోళనకు గురవుతున్నారు. గృహలక్ష్మికి సంబంధించి తమకు ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని అధికారులు దరఖాస్తుదారులను తిప్పి పంపుతున్నారు. బుధవారం 'సాక్షి' విజిట్‌లో పలు ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి. గృహలక్ష్మిపథకానికి దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం ఉదయం కొంత మంది మహిళలు మొయినాబాద్ మండల పరిషత్ కార్యాలయానికి వచ్చారు. దరఖాస్తులు తీసుకోవాలని అధికారులను కోరారు. తమకు ఇప్పటి వరకు ఎలాంటి మార్గదర్శకాలు రాలేదని అధికారులు వచ్చిన వారిని వెనక్కి పంపించారు. అంతలో అక్కడికి వచ్చిన స్థానిక నేత ఒకరు దరఖాస్తులను ఆయా గ్రామాల్లోని ఎంపీటీసీలు, సర్పంచులకు ఇవ్వాలని సూచించారు.

మీ-సేవ కేంద్రానికి పరుగులు

గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలంటే కులం, ఆదాయం సర్టిఫికెట్లు అవసరం. వీటి కోసం ప్రజలు మీ-సేవ కేంద్రానికి పరుగులు పెట్టారు. మొయినాబాద్ మండలం మొత్తానికి రెడ్డిపల్లిలో మాత్రమే మీ-సేవ కేంద్రం ఉంది. దీంతో మండల ప్రజలంతా అక్కడికే వస్తున్నారు. భారీగా జనాలు రావడంతో కేంద్రం నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. అయితే సర్టిఫికెట్లు పొందడానికి మహిళలు నాలుగైదు గంటల పాటు వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో చాలా మంది మీ-సేవ కేంద్రంలో దరఖాస్తు చేసి ఆ పత్రాలతో తహసీల్దార్ కార్యాలయానికి వస్తున్నారు. అక్కడ కూడా గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోంది.

రోజంతా మీ-సేవ కేంద్రం వద్దే



గృహలక్ష్మి పథకం కింద ఇల్లు కట్టుకోవడానికి దరఖాస్తు చేసుకోవాలనుకున్నా. ప్రభుత్వం రెండు రోజులు మాత్రమే గడువు ఇచ్చింది. దరఖాస్తుకు కులం, ఆదాయం సర్టిఫికెట్లు పెట్టాలన్నారు. వాటి కోసం మీ-సేవ కేంద్రానికి వెళ్లాను. అక్కడ చాలా మంది ఉండడంతో రోజంతా గడిచిపోయింది. గురువారమే చివరి రోజు కావడంతో అప్పటిలోగా సర్టిఫికెట్లు వస్తాయో లేదో తెలియడం లేదు. దరఖాస్తు గడువు పెంచాలి.

– వసంత, చందానగర్, మొయినాబాద్ మండలం

గైడ్‌లైన్స్ రాలేదు



గృహలక్ష్మి పథకానికి సంబంధించి మాకు ఎలాంటి గైడ్‌లైన్స్ రాలేదు. దరఖాస్తు ఎవ్వరికి ఇవ్వాలి, దరఖాస్తుకు ఏయే సర్టిఫికెట్లు జత చేయాలి అనే విషయంపై క్లారిటీ లేదుఙ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని చూసి చాలా మంది దరఖాస్తు పత్రాలు తీసుకుని మా వద్దకు వచ్చారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెప్పి వారిని వెనక్కు పంపుతున్నాం.

– సంధ్య, ఎంపీడీఓ, మొయినాబాద్

12 వరకు అవకాశం

- 'గృహలక్ష్మి'కి దరఖాస్తు చేసుకోండి: కలెక్టర్ హరీష్

సాక్షి, రంగారెడ్డి జిల్లా: గృహలక్ష్మి పథకానికి ఈ నెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ హరీష్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో గృహలక్ష్మి పథకం అమలు, హరితహారంపై ఆయా శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్థలం ఉన్న పేదలు ఇళ్లు కట్టుకోవడానికి ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సహాయం చేస్తుందని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణకు మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సొంత స్థలం, ఆహార భద్రత కార్డు, ఆధార్ కార్డు ఉన్న వారు గృహలక్ష్మి పథకానికి అర్హులన్నారు. ఆర్‌సీసీ ఇల్లు ఉన్న వారు, 59వ జీవో కింద కవర్ అయిన వారు అనర్హులని తెలిపారు. దరఖాస్తులను 20వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు.

మొక్కలు నాటాలి

జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ సూచించారు. లక్ష్యానికి అవసరమైన మొక్కలను సమకూర్చుకోవాలన్నారు. రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జెడ్పీ సీఈఓ దిలీప్ కుమార్, జిల్లా పరిశ్రమలు, హౌసింగ్ అధికారి రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

సెక్టార్ ఆఫీసర్లదే కీలకపాత్ర

ఎన్నికల నిర్వహణలో సెక్టార్ ఆఫీసర్లదే కీలకపాత్ర అని కలెక్టర్ హరీష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సెక్టార్ అధికారులు, నోడల్ అధికారులకు ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శిక్షణను సద్వినియోగం చేసుకొని సమర్థవంతంగా విధులు నిర్వహించాలని అన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి వసతులు ఉండేలా చూడాలన్నారు. రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించి సమస్యలపై చర్చించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌డీఓ సంగీత తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలి

స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓను ఆదేశించారు.



గృహలక్ష్మి పథకం వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్, హాజరైన అధికారులు

నేడు 'ఆర్యవైశ్య' సదస్సు

హుడాకాంప్లెక్స్: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ సాధన కమిటీ సదస్సును గురువారం కర్మన్‌ఘాట్‌లోని శ్రీ లక్ష్మీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు చింతల బాలరాజుగుప్తా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం ప్రభుత్వం వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని, అదే విధంగా జనాభా ప్రాతిపదికన చట్టసభల్లో ఆర్య వైశ్యులకు ప్రాతినిధ్యం కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల బడ్జెట్‌ను కేటాయించాలని డిమాండ్ చేశారు. సదస్సుకు ఆర్యవైశ్యులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

భర్తతో గొడవపడి..

ఇంటినుంచి వెళ్లిపోయిన భార్య


శిరీష (ఫైల్)

చేవెళ్ల: ఇంట్లో గొడవ పడిన భార్య చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదని భర్త రాజు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చేవెళ్ల పోలీసులు తెలిపిన వివరాలు.. చేవెళ్ల మండలం అంతారం గ్రామానికి చెందిన మన్నెగూడ రాజు అదే గ్రామానికి చెందిన శిరీషను ఏడాది క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఏడాది కాలంగా కలిసి ఉంటున్నారు. బుధవారం ఉదయం భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో ఇంట్లో చెప్పకుండా శిరీష బయటకు వెళ్లింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వారిని సంప్రదించినా ఎక్కడా ఆచూకి లభించలేదు. దీంతో భర్త రాజు చేవెళ్ల పోలీస్ స్టేషన్‌లో తన భార్య కనిపించడం లేదని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొట్టిన బైక్

- యువకుడి దుర్మరణం

మహేశ్వరం: బైక్‌పై వెళ్తున్న యువకుడు ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొని అక్కడికక్కడే దుర్మరణం చెందిన ఘటన మహేశ్వరం గేటు సమీపంలో చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ మురి తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన శ్రీకాంత్ (23) వృత్తిరీత్యా కారు డ్రైవర్. బుధవారం సాయంత్రం మహేశ్వరం నుంచి తుక్కుగూడ వైపు బైక్‌పై వెళ్తుండగా మహేశ్వరం గేటు దాటగానే ప్రమాదవశాత్తు చెట్టును ఢీకొట్టాడు. ప్రమాదంలో శ్రీకాంత్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడు ఘట్టుపల్లి వాసిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్ఐ రవీందర్ కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

పూజలు చేశారు.. మూలన చేర్చారు!

ఎండకు ఎండుతూ.. వానకు నానుతున్న వాహనాలు

- డ్రైవర్లు లేకుండానే జేసీబీలు.. డోజర్ల కొనుగోలు
- అధికారుల తీరుపై వెల్లువెత్తుతున్న విమర్శలు


రాగన్నగూడలోని వార్డు కార్యాలయం పక్కన నిలిపి ఉన్న వాహనాలు

తుర్కయంజాల్: పురపాలక సంఘంలో రూ.1.30 కోట్ల అంచనా వ్యయంతో కొనుగోలు చేసిన జేసీబీ, ఇసుజు కారు, రెండు మినీ డోజర్లు, రెండు టాటా ఏస్ వాహనాలు నిరుపయోగంగా మారాయి. వీటిని వినియోగించకుండా మూలన పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జూలై 7న పూజలు చేయించి, రాగన్నగూడలోని వార్డు కార్యాలయం పక్కన పార్క్ చేయగా.. నెల రోజులుగా ఎండకు ఎండుతూ.. వానకు నానుతున్నాయి.

కమీషన్ల కక్కుర్తి..

వాహనాలను కొనుగోలు చేసిన అధికారులు వీటిని నడిపేందుకు డ్రైవర్లను నియమించలేదు. దీంతో కోట్లాది రూపాయలు పెట్టిన వాహనాలు దిష్టిబొమ్మల్లా దర్శనమిస్తున్నాయి. కమీషన్లకు కక్కుర్తి పడిన కొంతమంది అధికారులు హడావుడిగా వీటిని కొనుగోలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

రూ.2 కోట్ల నిధుల కేటాయింపు....

స్వచ్ఛ సర్వేక్షణ్– 2022లో వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల జాబితాలో తుర్కయంజాల్ పురపాలక సంఘానికి అవార్డు వచ్చిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అవార్డులు సాధించిన మున్సిపాలిటీలకు ప్రోత్సాహకంగా.. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రూ.2 కోట్లు నిధులు కేటాయించారు. వీటితో అధికారులు వాహనాలు కొనుగోలు చేశారు. ఈ వ్యవహారంలోనూ అవకతవకలు జరిగాయని.. కలెక్టర్, అదనపు కలెక్టర్, సీడీఎంఏ అధికారులు స్పందించి వాహనాల కొనుగోళ్లపై విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

వినియోగంలోకి తెస్తాం

పూర్తి పారదర్శకంగా వాహనాలు కొనుగోలుచేశాం. సూపర్ మిషన్ పవర్ టూల్స్ అనే కంపెనీ టెండర్ ద్వారానే ఈ ప్రక్రియను పూర్తిచేశాం. డ్రైవర్ల నియామకం కోసం కలెక్టర్ అనుమతికి దరఖాస్తు చేశాం. పర్మిషన్ వచ్చిన వెంటనే నియామకం చేపట్టి, వాహనాలను వినియోగంలోకి తెస్తాం.

– గుణాకర్, ఏఈ


సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మంత్రి సబితారెడ్డి, నాయకులు

జల్‌పల్లి అభివృద్ధికి రూ.25 కోట్లు

మంత్రి సబితా రెడ్డి

పహాడీషరీఫ్: ఖాళీ స్థలం ఉన్న పేదలు గృహలక్ష్మీ పథకానికి దరఖాస్తు చేసుకొని రూ.3 లక్షల లబ్ధి పొందాలని మంత్రి సబితారెడ్డి సూచించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని 2, 3 ,4, 5 వార్డుల్లో రూ.3.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు బుధవారం మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం జల్‌పల్లి మున్సిపాలిటీ అభివృద్ధి కోసం రెండు రోజుల క్రితం రూ.25 కోట్ల నిధులు విడుదల చేసిందన్నారు. ఇప్పటికే 58, 59 జీఓల కింద ఉన్న ఇళ్లకు సంబంధించి రెగ్యులరైజ్ చేయడంతో ఎంతో మందికి మేలు కలిగిందని....తాజాగా నోటరీపై కూడా క్రమబద్ధీరిస్తుండడాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జల్‌పల్లి చైర్మన్ అబ్దుల్లా సాది, కమిషనర్ వసంత, కౌన్సిలర్లు అహ్మద్ కసాది, జింకల రాధిక శ్రవణ్, రహిమా యాహ్యా, జాఫర్ బామ్, కోఆప్షన్ మెంబర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, నాయకులు సయ్యద్ యూసుఫ్ పటేల్, షేక్ అఫ్జల్, ఎక్బాల్, యంజాల జనార్దన్, లక్ష్మీనారాయణ, పల్లపు శంకర్, ఉస్మాన్ షరీఫ్, ఉమర్ బామ్, నగేష్, మేరాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లపట్టాల పంపిణీ..

మహేశ్వరం: నిరుపేదలకు అండగా ఉండే ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వమేనని మంత్రి సబితారెడ్డి అన్నారు. మహేశ్వరం మండలం సిరిగిరిపురం గ్రామంలో సర్వే నం–61లోని ప్రభుత్వ భూమిలో 300 మంది నిరుపేదలకు బుధవారం మంత్రి ఇళ్లపట్టాలను పంపిణీ చేశారు. నిరుపేదల కష్టాలు తెలిసిన ముఖ్యమంత్రి కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పెద్దదిక్కుగా ఉన్నారని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, మహేశ్వరం ఎంపీపీ, వైఎస్ ఎంపీపీ, నాయకులు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై హత్యాయత్నం కేసులో..

నిందితుడి రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

శంకర్‌పల్లి: వృద్ధురాలిపై హత్యాయత్నం చేసి నగదును దోచుకెళ్లిన నిందితుడిని శంకర్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నార్సింగి ఏసీపీ లక్ష్మీనారాయణ శంకర్‌పల్లి పీఎస్‌లో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ఫత్తేపురానికి చెందిన హనమగళ్ల బాలమ్మ అనే వృద్ధురాలు తన మనుమరాలు అనూషను షాబాద్ మండలం దోసాడ గ్రామానికి చెందిన కంతి సతీష్‌కి ఇచ్చి వివాహం జరిపించింది. కాగా అనూష పాలివాడైన శంకరయ్య కూతురిని ఫత్తేపురానికి చెందిన శనిగళ్ల అరుణ్‌తో వివాహం జరిగింది. శంకరయ్య తన కూతురు దగ్గరకు వచ్చే క్రమంలో బాలమ్మతో పరిచయం పెంచుకున్నాడు. ఈనెల 6న తన కూతురు ఇంట్లో పుట్టినరోజు వేడుకలు ఉండటంతో ఫత్తేపురానికి రావడం జరిగింది. 7వ తేదీన ఉదయం బాలమ్మ ఇంటికి వెళ్లిన శంకరయ్య చాయ్ తాగి ఇంట్లో ఎవరూ లేరు.. ఒంటరిగా ఉందని నిర్ధారించుకున్నాడు. 8వ తేదీన రాత్రి 2గంటల ప్రాంతంలో బాలమ్మ ఇంటికి వెళ్లి నేను శంకరయ్యను వచ్చాను తెల్లవారింది..తలుపులు తీయమని అనగా.. బాలమ్మ తలుపు తీసింది. వెంటనే శంకరయ్య బాలమ్మను దిండుతో శ్వాస ఆడకుండా చేశాడు. ఆమె చనిపోయిందని అనుకొని చెవులకు ఉన్న 7గ్రాముల బంగారు కమ్మలు, 50 తులాల కాళ్ల కడియాలు,ఇంట్లోని రూ.5వేల నగదును దోచుకొని ఇంటి బయట నుంచి తాళం వేసి పారిపోయాడు. ఉదయం 11గంటలకు బాలమ్మ ఇంట్లో నుంచి కేకలు వేయడంతో ఇంటిపక్కవారు తాళం పగులగొట్టారు. బాలమ్మ జరిగిన విషయాన్ని తెలుపడంతో కుటుంబ సభ్యులతో కలిసి శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శంకర్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని గాలించి పట్టుకున్నారు. బుధవారం నిందితుడిని రిమాండ్‌కు తరలించా. కేసు దర్యాప్తులో కానిస్టేబుల్ నాగభూషన్, శ్రీనివాస్‌లు బాగా శ్రమించారని తెలిపారు. శంకర్‌పల్లి సీఐ వినాయక్‌రెడ్డి, డిటెక్టివ్ సీఐ నాగరాజు, ఎస్ఐ సంతోష్‌రెడ్డి ఉన్నారు.

'ఖబరస్థాన్ జీవో'ను రద్దుచేయాలి

కలెక్టర్, ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధుల వినతి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్, నాయకులు

తలకొండపల్లి: ఖానాపూర్ గ్రామ పంచాయతీ ప్రభుత్వ భూమిలో ఖబరస్థాన్ నిర్మాణానికి జారీ చేసిన జీవోను వెంటనే రద్దు చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు ఉప్పల వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఎంపీపీ నిర్మలశ్రీశైలంగౌడ్‌తో కలిసి బుధవారం కలెక్టర్ హరీష్‌కు వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రంలో ఎంపీటీసీ సరితాగణేశ్‌గుప్తా, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కలిసి ఖబర్‌స్థాన్ నిర్మాణాన్ని ఆపాలని కోరారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. ఖానాపూర్ పంచాయతీ పరిధిలోని 256 సర్వే నంబర్‌లో 42 ఎకరాల్లో ఖబరస్థాన్ నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల జీవో జారీ చేసిందన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. సదరు భూముల్లో ప్రభుత్వ కార్యాలయాలు నిర్మించాలన్నారు. విద్యార్థులకు అవసరమైన గురుకుల పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాలు వంటివి నిర్మిస్తే అన్నివర్గాల వారికి ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. గతంలో ఈ స్థలాన్ని జీహెచ్ఎంసీ డంపింగ్ యార్డు కోసం కేటాయించగా.. అప్పట్లో ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టడంతో ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్రాంరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ యాదయ్య, గణేశ్‌గుప్తా, మాజీ ఎంపీపీ శ్రీనివాస యాదవ్, మాజీ జెడ్పీటీసీ నర్సింహ, సర్పంచ్‌లు లలితాజ్యోతయ్య, రమేష్, ఉప సర్పంచ్ అనిల్, రాజేందర్‌రెడ్డి, శశశంకర్‌రెడ్డి, దశరథ్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మాట నిలుపుకొన్న కేసీఆర్

- రేషన్ డీలర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- మంత్రి సబితారెడ్డి
- కమీషన్ పెంపుపై కృతజ్ఞతలు తెలిపిన డీలర్లు


మంత్రి సబితారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రేషన్ డీలర్లు

మహేశ్వరం: రేషన్ సరుకులపై కమీషన్ పెంచి ఇచ్చిన మాట సీఎం కేసీఆర్ నిలుపుకున్నారని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. కమీషన్ పెంపుపై బుధవారం వారు మంత్రిని కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రేషన్ డీలర్ల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందన్నారు. క్వింటాలుకు రూ. 70 ఉన్న కమీషన్‌ను రూ.140కి పెంచినట్లు తెలిపారు. హెల్త్ కార్డుల విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పీ లక్ష్మీనారాయణ గౌడ్, మండల అధ్యక్షుడు ఎంఏ సత్తార్, రేషన్ డీలర్లు శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, విజయ్, కృష్ణ, శివ, వెంకటరమణారెడ్డి, వెంకటేష్, యాదయ్య పాల్గొన్నారు.

మున్సిపాలిటీల అభివృద్ధికి కృషి

తుక్కుగూడ: మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం తుక్కుగూడలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందన్నారు. మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని 9,12,14వ వార్డులో సీసీ రోడ్లు,అండర్ గ్రౌండ్ డ్రైనే జీ,రజక,శాలివాహన సంఘాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఎస్‌డీఎఫ్ నిధులు రూ.25 కోట్లు మంజూరు చేయడంపై మంత్రి.. సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ బీ వెంకట్రామ్, డీఈఈ యాదయ్య, ఏఈఈ కే భార్గవ్‌రెడ్డి,కౌన్సిలర్లు హేమలత, భావన, లావణ్య, సుమన్, నాయకులు రాజు,శ్రీధర్, సురేష్, చంద్రశేఖర్ రెడ్డి,నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

మంత్రికి కృతజ్ఞతలు

బడంగ్‌పేట్: కమీషన్ పెంపుపై నియోజకవర్గ రేషన్ డీలర్లు సంతోషం వ్యక్తం చేశారు. బుధవారం మంత్రి సబితారెడ్డి నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.మా బతుకుల్లో జీవం నింపిన కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్, బాలాపూర్ మండల అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, డీలర్లు గణేష్, కృష్ణగౌడ్, సురేష్‌గుప్తా, హర్షవర్ధన్, భాస్కర్‌రెడ్డి, సత్తయ్య, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

ఒకరి దుర్మరణం.. ఇద్దరికి గాయాలు


సీసీ పుటేజీలో ప్రమాదానికి కారణమైన లారీ దృశ్యాలు


లాలప్ప (ఫైల్)

తాండూరు టౌన్: లారీని దొంగతనం చేయడంతో పాటు, బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పట్టణ సీఐ రాజేందర్ రెడ్డి తెలిపిన వివరాలు.. యాలాల మండలం హాజీపూర్‌కు చెందిన కృష్ణ హైదరాబాద్‌లో గురుకుల పాఠశాల పరీక్ష ఉండటంతో బుధవారం తెల్లవారుజామున నరేష్, లాలప్పతో కలిసి బైకుపై తాండూరు రైల్వే స్టేషన్‌కు వస్తున్నాడు. పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపైకి రాగానే ఓ లారీ వెనుక నుంచి వచ్చి బైకును ఢీకొట్టింది. దీంతో లాలప్ప (28) తలకు బలమైన దెబ్బ తగలగా అక్కడికక్కడే మృతి చెందాడు. కృష్ణతో పాటు నరేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ఇద్దరినీ తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో లారీని వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. కాగా కరన్‌కోటకు చెందిన ఓ వ్యక్తి ఇట్టి లారీని మంగళవారం రాత్రి దొంగతనం చేసి పట్టణంలో చక్కర్లు కొట్టినట్లు సీసీ కెమెరాల్లో పోలీసులు గుర్తించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేందర్ రెడ్డి తెలిపారు.


చెన్నారెడ్డిగూడ-బోడకొండ గుట్టల మధ్య జలపాతం, (ఇన్‌సెట్‌లో) పోలీసులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

జలపాతం.. జాగ్రత్త గురూ..


గుట్టల మధ్య ఉన్న చెక్‌డ్యాం

మంచాల మండలంలోని చెన్నారెడ్డి గూడ–బోడ కొండ గుట్టల మధ్య నుంచి జాలువారుతున్న జలపాతం వద్ద పర్యటకుల తాకిడి ఎక్కువవుతోంది. ఇక్కడ పూర్తిగా బండరాళ్ల మధ్య గుట్టల నుంచి వచ్చే వర్షపు నీరు జాలుపారుతోంది. చూడడానికి ఆహ్లాదకరంగా ఉన్నప్పటికీ ఇక్కడ గతంలో జాలు కింద ఉండే చెక్ డ్యాంలో పడి ఒకరు మృత్యువాతపడ్డారు. ఇక్కడకు రావొద్దని పోలీసులు కూడా హెచ్చరికలు జారీ చేశారు. ఈ ప్రాంతం వద్దకు రావద్దంటూ ఫ్లెక్సీ కూడా ఏర్పాటు చేశారు. అయినా స్థానికులు ఇక్కడకు వస్తున్నారు. చుట్టూ గుట్టల ప్రాంతం కావడంతో నగరం శివారు ప్రజలు ఇక్కడకి వచ్చి ప్రకృతి, జలపాతం అందాలను తమ కెమెరాల్లో బంధిస్తున్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి పర్యాటకులు ఇటువైపు రాకుండా అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – మంచాల